
# పిలుపు

సి.హెచ్. భవానీశంకర్



అంతా దాగుడుమూత లాడుతున్నారు.

సరస్వతీ, శారదా, సుశీలా, గీతా, విజయా — అంతా ఓణీలు అప్పుడప్పుడే వేస్తున్న పిల్లలు. వారందరికన్నా ఏడాదో, రెండేళ్లో నేనే చిన్నవాడిని.

నేనొక్కడినీ డాబా మీద పిట్టగోడ దగ్గర నిలబడి వాళ్ళ ఆటలు చూస్తున్నాను.

అందరినీ చూస్తూనే ఉన్నాను గాని ఎక్కువగా విజయే నా దృష్టి నాకర్షిస్తోంది.

పెదాలు బిగపట్టి పంటలు వేస్తూ, దొంగయిన వాళ్ళ వంక చూసి వెక్కిరింపుగా నవ్వుతూ — పరుగెడుతూ....

ఎందుకో నాకు తెలీదు. చూసిన కొద్దీ విజయనే చూడాలనిపిస్తోంది.

మళ్ళీ పంటలు వేశారు. గీత దొంగ అయింది. కాంపౌండ్ గోడ దగ్గరికెళ్ళి గోడవేపు తిరిగి కళ్ళు మూసుకొని నిలబడింది.

అందరూ దాక్కోడానికి తలో మూలకూ పరుగెత్తారు. విజయ చకచకా మెట్లెక్కేసి డాబా మీద కొచ్చింది.

"ఏయ్! నేనిక్కడ ఉన్నట్లు చెప్పావో చెవి మెలేస్తాను — జాగ్రత్త!" నాతో అని పొగ గొట్టం వెనుకకు పరుగెత్తి దాక్కుంది.

ఆయాసంతో ఒగరుస్తున్న ఆమెనే తదేకంగా చూస్తూ నిలబడ్డాను.

"నువ్వేలాగో నన్ను పట్టించేస్తావ్, నాకు తెలుసు. ఇటే చూస్తూంటే గీతకు నేనిక్కడున్నట్లు తెలిసిపోదూ?" అంటూ పై పంటితో కింద పెదవిని నొక్కి మందలించింది నన్ను.

చిన్నగా నవ్వి, దృష్టి మరల్చాను గాని, తిరిగి ఆమెను చూడాలన్న కోరిక పెరిగిపోయింది.

"ఇదిగో — నీతో గొడవే కాని — ఇట్రా! నువ్ కూడా ఈ మూల నక్కు" అంటూ పిలిచింది దబాయింపుగా.

మౌనంగా ఆమె దగ్గరకు నడిచి నేను పొగ గొట్టం వెనక కూర్చున్నాను.

"ఇంకా దగ్గరకురా! బయటకు కనబడిపోతావ్!" అంది విజయ.

ఆమెకు అతి సమీపంగా కూర్చున్నాను. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు నా మొఖం మీద తగిలి నాకు చక్కిలిగిలి పెడుతున్నట్లుంది.

అంతలోనే గీత వెతుక్కుంటూ డాబా మీద కొచ్చేసింది. విజయ చటుక్కున నన్ను తనలోకి గట్టిగా పొదువుకొని కూర్చుంది.

# పిలుపు



ఆమె స్పర్శ, ఆమె ఊపిరి_ ఆమె మొఖంలోని ఆత్రుత_ఆ నిశ్శబ్దం_విజయ అంటే ఒక విధమయిన అనుభూతి ఏర్పడింది. ఏమిటో తెలీని ఆకర్షణ నన్ను లోబరుచుకోసాగింది. అయితే విజయ దృష్టి మాత్రం నా మీద లేదు. గీత తనని కనుక్కుంటుందేమో అన్న భయం మీదే ఉంది.

ఒకటి రెండు పొగ గొట్టాల వెనుక వెతికి గీత డాబా దిగి వెళ్ళిపోయింది. అప్పటికి నన్ను వదిలి లేచింది విజయ. కాని నేను మంత్రించినట్లు అక్కడే కూర్చుండిపోయాను చాలా సేపటి వరకూ.

ఆ రాత్రంతా నాకు కలలే. విజయా నేనూ ఆడుకుంటున్నట్లూ, పరుగెడుతున్నట్లూ, ఆమె ఆటల్లో నన్ను గట్టిగా కౌగిలించుకొన్నట్లూ_

తెల్లారేసరికి నా మనసంతా వెంటనే విజయను చూడాలన్న కోరికతో నిండిపోయింది. ఆమె కోసం నిర్వచించలేని బాధ, తపన ప్రప్రథమంగా అలాంటివి చోటు చేసుకున్నాయ్ నాలో!

విజయ వాళ్ళింటివేపు వెళ్లాను. నూతి దగ్గర హడావిడిగా అంట్లు తోముతోంది విజయ. వాళ్ళ నాన్న చుట్ట కాల్చుకుంటూ అరుగు మీద కూర్చుని ఏవో కాగితాలు చూస్తున్నాడు. ఆమెను చూడగానే ఎంతో సంతృప్తి కలిగింది నాకు.

"ఏయ్? ఎక్కడికి పొద్దున్నే బయల్దేరావ్?" లేచి నిలబడి చేతులు దూరంగా చాస్తూ అడిగింది.

"ఊరకే" అనేసి, వడివడిగా నడిచాను.

రోజంతా స్కూల్లో ఎలా గడిచిపోయిందో తెలీదు.

ఎప్పుడు సాయంత్రమవుతుందా, ఎప్పుడు విజయను చూస్తానా అన్న తహ తహ.

ప్రతిరోజూ ఆమెను ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా చూడటం అలవాటయిపోయింది. వేసవి సెలవులు వచ్చేసినయ్.

నాకు ఆనందంగా ఉంది. ఎన్నోసార్లు విజయను చూస్తూండవచ్చు, ఆమెతో మాట్లాడుతూండవచ్చు. విజయకు తల్లి లేదు. తనూ, తండ్రీ, ఓ తమ్ముడూ అంతే!

ఇలా వుండగా హఠాత్తుగా

విజయ వివాహం అన్న వార్త మా పేటంతా పాకిపోయింది. ఇంట్లో మా అమ్మతో పక్కింటామె చెబుతూంటే విన్నాను. నిజానికి విజయ మరీ అంత పెద్దది కాదు. ఆమెకు అప్పుడే పెళ్ళి తలపెడుతారని నేనూహించలేదు. ఆ పెళ్ళి విషయం విన్నప్పటినుంచి వీలయినన్నిసార్లు ఆమె ఇంటి మీదుగా తిరుగుతూ ఆమెను చూసే అవకాశం కోసం ఎదురు చూస్తూండే వాడిని. నన్ను చూచినప్పుడల్లా విజయ పలుకరించడమో, నవ్వడమో మాత్రం చేస్తుండేది.

మరో నెల రోజుల్లోగానే విజయ ఇంటిముందు పందిరి వేశారు. పచ్చని మామిడి తోరణాలు పందిరంతా వెలసినయ్. వాళ్ళింటి నిండా చుట్టాలు, సినిమా రికార్డులూ హడావిడిగా తయారయిపోయింది.

ఆ రోజు రాత్రికే ఆమె వివాహం! నాకు మనసంతా వికలమైపోయింది. విజయను ఎవరో నానుండి విడదీస్తున్నట్లు అనిపించింది. పెళ్ళికి వెళ్ళి, పందిట్లో ఓ మూలగా నిలబడ్డాను. అర్ధరాత్రి రెండింటికి ముహూర్తం. విజయను ఇంట్లోనుంచి పందిట్లోకి నడిపించుకొచ్చారు. ఆమె తల వంచుకొని ఉంది. ఆమె అందం అప్పుడు

# పిలుపు



విజృంభించినట్లనిపించింది నాకు. కళ్ళ నిండుగా పేరుకు పోయిన కాటుకతో మొదటిసారిగా కట్టుకొన్న చీరలో సినిమాల్లో చూపే దేవకన్యలా ఉంది. పెళ్ళికొడుకు ఏమంత బావుండలేదు. అతను ఎక్కువ చదువుకోలేదట. వ్యవసాయం చేస్తున్నాడట. విజయ కంటె పదిహేనేళ్లు ఎక్కువ వయసుంటుంది.

విజయ మధ్యలో ఓసారి నా వంక చూసింది. ఆమె పెదాల మీద చిరునవ్వు-వెంటనే చిన్నగా మరెవ్వరికీ కనబడనట్లు వెక్కిరించింది. ఆ రూపం నాలో ముద్రించుకుపోయింది. అంతే! ఉండలేక వెంటనే అక్కడినుంచి బయటికొచ్చేశాను. చాలాసేపు బయట పంపుగట్టు మీద కూర్చుని ఆలోచిస్తూండిపోయాను. ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆగటంలేదు. అలా ఎందుకు దుఃఖించాలో కూడా నాకు తెలీడంలేదు.

ఆ తరువాత విజయ కనిపిం

# పిలుపు



చడం తగ్గిపోయింది.

కొద్దిరోజుల తరువాత ఆమె అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆ రోజు సాయంత్రం నేను డాబా మీద నిలబడి ఆమె ఇంటివేపే చూడసాగాను. ఎద్దుల బండిలో బస్ స్టాండుకి బయల్దేరిందామె భర్తతో. బండి మా ఇంటిదగ్గర కొచ్చేసరికి బండిలోనుంచి తొంగి చూసింది. డాబామీద నన్ను చూడగానే సంతోషంగా నవ్విందామె. వెంటనే వెక్కిరింపు-వళ్ళు జలదరించి నట్లయింది నాకు. కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. బండి దూరమయిపోయింది. చాలా రోజుల వరకూ నేను మామూలు మనిషిని కాలేకపోయాను.

రోజులుగడుస్తూనేఉన్నాయ్.

నేను యస్సెల్సీ పరీక్షలు రాస్తూండగా కాబోలు, విజయ తిరిగి వచ్చింది. మా యింటికొచ్చి అక్కయ్యాలో మాట్లాడుతోంటే చూశా నామెని. అంతవరకూ ఆమె వచ్చిందన్న విషయమే తెలీదు నాకు. ఆమెలో ఇప్పుడు చాలా మార్పులు వచ్చాయి. లావయింది. ఆకర్షణ-అందం-మరింత ఎక్కువ యినయ్! చాలా ఎదిగిపోయిన దానిలా ఉంది.

"ఏమిటి పుస్తకాల పూజ చేస్తున్నావ్?! పరీక్షలా?" అంటూ అడిగింది నా దగ్గర కొచ్చి!

"అవును..." అన్నాను ఆమె వంకే చూస్తూ.

"బాగా చదువు! చదువు లేకపోతే సంస్కారం రాదు!" అంది నవ్వుతూ.

"అంటే?" అనడిగాను విచిత్రంగా చూస్తూ.

"మా ఆయనకు చదువు లేదు కదా! ఏమీ తెలీదు. ఎప్పుడెలా మాట్లాడాలో - ఎలా మాట్లాడకూడదో..." అలా అంటూంటే ఆమె పెదాలమీది నవ్వు మాయ మయిపోయింది. అయోమయంగా చూస్తూండిపోయా నామెవంక.

"అది సరే గానీ- నే వెళ్ళి ఇన్ని రోజులయి పోయింది కదా! ఇక్కడ నన్నెవరయినా గుర్తు చేసుకొన్నారూ?" తిరిగి చిరు నవ్వుతో అడిగింది.

"బావుంది! నిన్ను తలచుకోని రోజే లేదు, తెలుసా?-మరి నీకెప్పు డయినా నేను గుర్తొచ్చానా?" అడిగాను. అలా అడిగినందుకు




నాకే భయం వేసింది.

"ఊహుఁ! మాటలు కూడా బాగానే వచ్చినయ్..." నా చెయ్యి పట్టుకుని నొక్కి వెళ్ళిపోయింది.

మరి కొద్ది రోజులకు విజయలో యింకో మార్పు గమనించాను. ఆమె గర్భిణీ. మిషన్ హాస్పిటల్లో ఆడపిల్లని ప్రసవించిందని అమ్మ అంటుంటే విన్నాను. ఎలాగైనా ఆమెని చూడాలన్న కోరిక ఊగించి వేస్తోంది నన్ను! కానీ ఎలా?

ఎవ్వరూ లేనప్పుడు ఓ రోజు మధ్యాహ్నం ఆమెని వెళ్ళి కలిసాను.

"నువ్వా?" అంది విజయ నన్ను చూస్తూనే ఆశ్చర్యంగా.

"నిన్ను చూడాలనిపించింది. ఎలా ఉన్నావో నని" అన్నాను ఆమె మంచం పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ.

మంచం మీదే లేచి కూర్చుంది

## అక్రమ సంతానం

కుటుంబనియంత్రణా పరిమితిని మించి పిల్లల్ని కంటే, ఆ అదనపు బిడ్డలను, అక్రమ సంతానంగా పరిగణించాలని ఒక పార్లమెంటు సభ్యుడు సూచనచేశాడు. ఉద్యోగులు ప్రతి ఏటా కుటుంబ లెక్కలు యివ్వాలని, అసలు ఉద్యోగాలలో చేరేటప్పుడు కుటుంబ నియంత్రణ పథకాన్ని క్రియాత్మకంగా ఆచరిస్తామని ప్రమాణం చేయాలి, లేదా లిఖితపూర్వకంగా యివ్వాలని మరికొందరు సూచించారు. ఏమైనా మనదేశంలో ఏటా ఒక కోటి 30 లక్షలమంది పిల్లలు పుడుతున్నారు....అంటే ఆస్ట్రేలియా మొత్తం జనాభా అంత. 1947 తర్వాత మనదేశంలో 25 కోట్ల మంది పుట్టారు. అంటే రష్యా జనాభా అంత. ఈలెక్కన మరో పాతికేళ్ళలో మనదేశ జనాభా నూరుకోట్లు అవుతుంది.

విజయ.

"ఎలావుంది పాపాయి?" అన డిగింది నీరసంగా నవ్వుతూ.

"బావుంది! అచ్చం నీలాగా ఉంది..." అన్నాను.

"ఇంత ఎండలో వచ్చావేం? ఇప్పటికి తీరిందా?"

"ఎవ్వరూ నీ దగ్గర లేనప్పుడు రావాలనుకున్నాను..."

"ఎందుకూ? ఏమయినా రహస్యం చెబుతావా?" నవ్వాపు కొంటూ అంది.

మరి కాసేపు కూర్చుని తిరిగి వచ్చేశాను.

వారం రోజులు తర్వాత హాస్పిటల్ నుంచి ఇంటికొచ్చేసిందామె.

పాపాయిని చూసే వంకతో రోజూ కాసేపు విజయతో మాట్లాడి రావడం అలవాటయి పోయింది.

మరి కొద్ది రోజులకు పేటంతా గుసగుసలు మొదలయినయ్. విజయను వాళ్ళాయన వదిలేశాడని.

నా కెందుకో చాలా బాధ కలిగించిందా వార్త.

మర్నాడు వెళ్ళినప్పుడు నెమ్మదిగా ఆ విషయం అడిగాను.

"ఏమో! ఆయన వదిలేశారేమో నాకు తెలీదు. పాపాయిని చూడ్డానికి కూడా రాలేదు మరి!" అంది నవ్వుతూ.

"మరి ... మరి ... నువ్వేమీ ఉత్తరం రాయలేదూ?"

"ఎందుకు రాయలేదు, నాలుగు ఉత్తరాలు రాశాను. ఒక్కదానికయినా జవాబు ఉంటేనా?"

"మీనాన్న ఏమంటున్నారు?"

"రాకపోతే పో నీ మంటున్నారు! తన కూతురిని తను పోషించుకోవడం కష్టమేమీ కాదట."

ఇంకేం మాట్లాడాలో తెలీలేదు నాకు. విజయ నేననుకొన్న దానికంటే చాలా ధైర్యస్థురాలే నని అనిపించింది.

నా కాలేజి చదువు పూర్తయి పోయింది. ఉద్యోగాల వేటలో పడ్డాను. మావయ్యగారమ్మాయి వివాహానికి ఇంట్లో అంతా ఊరు వెళ్ళారు. రెండురోజులు నేనే వంట చేసుకొంటూండగా విజయ వచ్చింది ఇంటికి. "బ్రహ్మచారి గారు ఏం చేస్తున్నారు?" అంటూ.

తలంటి పోసుకొని జుట్టు వదులుగా ముడి వేసుకొంది. ఎంతో అందంగా, హుందాగా ఉందామె రూపం! ఆమెను చూస్తూంటే మనసు చలించిపోతోంది. అతి కష్టం మీద చూపు మరల్చాను.

"ఏం వండుతున్నావేమిటివాళ?" అడిగింది స్టౌ దగ్గరున్న కాయగూరలు చూస్తూ.

"ముందు అన్నం వండేస్తున్నాను. కూరసంగతి ఇంకా ఆలో




చించలేదు..."

"కూరలు వండటం నీకేంవచ్చు గానీ_నేను తీసుకొచ్చి ఇస్తానులే! నువ్వేమీ చేయకు!" అంది చనువుగా!

మధ్యాహ్నానికి తనే కూరలు తీసుకొచ్చి ఇచ్చింది. సాయంత్రం ఆరవుతోండగా నెమ్మదిగా ఆమె ఇంటివేపు బయల్దేరాను. అప్పటికే బాగా చీకటి పడిపోయింది. విజయ ఇంట్లో లైట్లు కనిపించలేదు. తడుముకొంటూ లోపలికి నడిచాను

"ఎవరది?" అంది విజయ లోపలి గదిలోనుంచి.

"నేనే_ఇల్లంతా చీకటిమయం చేసేశావేమిటి?" అనడిగాను అక్కడినుంచే.

"కరెంటు పోయిందిప్పుడే! అగ్గిపెట్లో పుల్లలయి పోయినయ్! ఏంచేయాలా అని చూస్తున్నాను" అంది నెమ్మదిగా బయటికొస్తూ.

"పాపాయి ఏదీ?"

"ఉయ్యాల్లో నిద్రపోతోంది"

అంత చీకట్లోనూ ఆమె అందం నా కళ్ళకు మెరుస్తూనే కనబడుతోంది. నాకు సమీపంగా ఆగి నవ్వింది విజయ.

"నువ్ సిగరెట్లు కాల్చేవాడివయినా బాగుండేది. నీ దగ్గరో అగ్గిపెట్టె దొరికేది_!"

"ఇదిగో అగ్గిపెట్టె_" చేయి చాస్తూ అనేశాను అప్రయత్నంగా

"ఏమిటి? అగ్గిపెట్టె ఉందా?" ఆశ్చర్యంగా అని, అందుకోడానికి చేయి చాచిందామె.

అలాగే చేయిఅందుకుని ఒక్క ఉదుటున ఆమెని నా మీదకు లాక్కున్నాను. అనుకోకుండా జరగడంవల్ల తూలి పూర్తిగా నా కౌగిట్లోకి వరిగిపోయింది. అంతే! ఎప్పటినుంచో అజ్ఞాతంగా నాలో ఎదుగుతోన్న కోరికా, ప్రేమా, ఆమెమీది అనురాగం - అన్నీ కట్టలు తెంచుకొన్నాయ్.

"ఏయ్! ఏమిటిది? నా కంటె మంచి అమ్మాయే కనిపించలేదా నీకు?"

సౌమ్యంగా అంటూనే విడిపించుకోడానికి ప్రయత్నించింది.

నాకు భయం వేసింది.

"వదులు! భలే వాడివే_ అందుకే బ్రహ్మచారీ_శతమర్కటః అన్నారు" అంటూ నా చేతులు వదిలించుకొని, దూరంగా జరిగి సాధ్యమైనంత మామూలుగా

మాట్లాడానికి ప్రయత్నిస్తూ అంది.

"సారీ విజయా! ఎప్పటినుంచో నువ్వంటే ఉన్న ఆరాధన ఇది! ఇవాళెందుకో నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోయాను.." తల వంచుకుని అన్నాను. గప్పున లైట్లు వెలిగినయ్, ఇల్లంతా వెలుగుతో నిండిపోయింది. ఆమెవంక చూడడానికి ధైర్యంలేకపోయింది.

"ఒక్క నిమిషం కూర్చో! కాఫీ తెస్తాను..." అంటూ వంటింటివేపు నడిచింది ఆమె.

అయిదు నిమిషాల సేపు వంటరిగా అక్కడే కుర్చీలో కూర్చుండిపోయాను.

కాఫీ తీసుకొచ్చి నా ముందు స్టూల్ మీద ఉంచింది. ఆమెను చూడగానే నా కెందుకో అప్రయత్నంగా కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

"విజయా! నిజం చెప్తున్నాను. నువ్ నన్ను నిరాకరించినా నాకిష్టమే! నన్ను నిందించినా సహిస్తాను. కాని... నాకు... నువ్వంటే ఉన్న ప్రేమ వేరు! నిన్ను కేవలం శారీరకంగా మాత్రం నేను కోరుకోవడంలేదు_ఇదినువ్వు నమ్మాలి" దీనంగా ఆమె వంక చూస్తూ అన్నాను.

విజయ కొద్ది క్షణాల వరకూ ఏమీ మాట్లాడలేక పోయింది. బహుశా ఆమె నానుంచి ఇలాంటి అనుబంధాన్ని ఎప్పుడూ ఊహించి ఉండదు. ఇంక అక్కడ కూర్చోవడం ఇబ్బంది కలిగించింది నాకు.

"వెళ్తాను విజయా!" అనేసి చకచక అక్కడినుంచి బయటకు నడిచాను.

ఆ తరువాత ఆమెను తప్పించుకొని తిరగసాగాను.

మరికొద్ది రోజులకే నాకు హైద్రాబాద్ లో ఉద్యోగం రావడం_వెంటనే అక్కడికి చేరుకోవడం జరిగిపోయింది. ఉద్యోగంలో చేరిన సంవత్సరం వరకూ తిరిగి మా ఊరు వెళ్ళే అవకాశం లభించలేదు. వెళ్ళిన రోజే విజయ ఇంటికి వెళ్ళాను. ఆమెను చూసే వరకూ మనశ్శాంతి లేకపోయింది.

"ఈ ఊరిమీద అలిగావా ఏమిటి_ఇన్నిరోజుల కొచ్చావ్?" నవ్వుతూ అందామె.

జవాబుగా నవ్వి ఊరుకొన్నాను. ఆమెలో అదివరకటి ఆకర్షణ లేదు. కళ్ళల్లో నిరాశ, నిస్పృహలు గూడుకట్టుకొన్నట్టున్నాయ్!

పాపాయి తప్పటడుగులు వేస్తోంది. ఎత్తుకుని ముద్దుపెట్టుకొన్నాను.

"వీళ్ళ నాన్నేమంటున్నారు? ఎప్పుడయినా ఈమధ్యవచ్చారా"

ఆమెవంక చూడకుండానే అడిగాను.

"రానూ లేదు! నేను ఎదురు చూడటమూ లేదు!"

కొద్దిసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"నీ పెళ్ళెప్పుడు బాబూ! రోజూ పోస్టుమేన్‌ను అడుగుతున్నాను శుభలేఖ వచ్చిందా అని"

"నీవు చెప్పే చేసుకొంటాన్లే" అన్నాను నవ్వుతూ.

"మా తమ్ముడు, వాళ్ళ క్లాసమ్మాయిని లేవదీసుకొని ఎటో వెళ్ళిపోయాడు_తెలిసిందా నీకు?" అడిగింది.

"అవునటగా! అమ్మ చెప్పింది రాగానే!"

మరికాసేపు అవీ ఇవీ మాట్లాడి అక్కడినుంచి బయల్దేరాను.

ఆరు నెలలు గడిచిపోయింది. సనత్ నగర్ నుంచి నాంపల్లిబస్‌లో వెళుతున్నా నా రోజు. లకడీకాపూల్ దగ్గర బస్ ఎక్కింది విజయ. ఆమెను చూస్తూనే త్రుళ్ళిపడ్డాను నేను. ఒంటరిగానే ఉంది. పక్కనెవ్వరూ లేరు. వెనుక సీట్లోఉండటంవల్ల వెంటనేఆమెను పలుకరించే అవకాశం లేకపోయింది నాకు.

నాంపల్లిలో బస్ ఆగగానే దిగి ఆమెను వెనకనించి వెళ్ళి కలుసుకున్నాను.




"నమస్కారం" అన్నాను నవ్వుతూ.

ఉలికిపాటుతో నా వంక చూసిందామె.

"నువ్వా! హడలిపోయాను ఎవరో అని." సర్దుకుంటూ అంది.

"ఏమిటి? ఇక్కడికెప్పుడొచ్చావ్?" ఆత్రంగా అడిగాను.

"వచ్చి రెండు నెలలయింది. రహత్ మహల్, ప్రక్కనసందులో ఇల్లు__ ఎప్పుడయినా ఒకసారి ఇంటికి రా!" అంది నవ్వుతూ.

"ఎవరిల్లు?" అని అడుగుదామని నోటివరకూ వచ్చిందిగాని, ఆమె చెప్పందే అడగడమెందుకని ఊరుకొన్నాను.

ఇంటి గుర్తులు చెప్పాక "అర్జంటు పని మీద విజయనగరకాలనీ వెళుతున్నాను.__మరి వెళ్ళిరానా?" అంది.

"సరే! ఎల్లుండి ఆదివారం కదా! మధ్యాహ్నం వస్తాను!" అన్నాను.

# పిలుపు



ఆమె వెళ్ళిపోయింది. తిరిగి ఆమె గురించి ఆలోచనలు_ఆమె మీది కోరికలు చెలరేగినయ్ నాలో.

ఆదివారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వెళ్ళాను. చాలా చిన్న ఇల్లు. ఒకే గది. వెనక చిన్న వంటిల్లు. మట్టితో కట్టిన గోడలు_పైన పెంకు! పాప బయట పిల్లలతో ఆడుకొంటోంది.

"రా! కూర్చో!" అంటూ ఓ పక్కగా వాల్చిన మంచం చూపించింది.

"ఎవరిదీ ఇల్లు?" కూర్చుంటూ అడిగాను.

"మా పెద్దమ్మ కూతురు భర్తది. ఆఅమ్మాయి చనిపోయింది. అతనికి వంటచేసి పెట్టేవారెవరూ లేరంటే నేను వచ్చాను..." అంది.

"మరి మీ నాన్న దగ్గరెవరుంటారు?"

"అదేమిటీ నాన్న పోయిన సంగతి నీకు తెలీలేదా?"

"అరె!పోయారా? ఎప్పుడు?"

"మూడు నెలలు అయిపోయింది! హఠాత్తుగా గుండెపోటు వచ్చింది! ఆ తరువాత ఇల్లంతా అద్దెకిచ్చి నే నిటువచ్చాను."

నాకు అనుమానమొచ్చింది. అతనితో ఈ ఇంట్లో విజయ వంటరిగా వుంటూ తనని కాపాడుకో గలుగుతుందా? ఉహుఁ! సాధ్యం కాని పనేమో అనిపించింది నాకు.

విజయవంక చూశాను! ఆమె శరీరంలో అదివరకటి బింకం కనిపించలేదు. నాకెందుకో, జాలి, దుఃఖం కలిగాయి. ఆమెను నా వెంట తీసుకెళ్ళిపోయి, ఏ చింతా లేకుండా చేయాలనిపించింది.

అంత ధైర్యం నాకెలా ఏర్పడిందో తెలియదు. లేచి అమాంతం ఆమె దగ్గరకు నడిచి. "విజయా!" అన్నాను చేయిపట్టుకొని దగ్గరకు లాక్కొంటూ.

"అతనొస్తున్నాడు!" అనేసి చటుక్కున లోపలకు వెళ్ళిపోయింది. మరు క్షణంలో నల్లగా, సన్నగా ఉన్న వ్యక్తి మాసిన బట్టలో లోపలికొచ్చాడు.

నన్ను ఇంట్లో చూసి అతనేం ఊహించుకొంటాడో అన్నభయం కలిగింది నాకు.

విజయ వచ్చి నుంచుందక్కడ. అతను నా వంక ఓసారి చూసి పెరట్లోకి నడిచాడు.

"ఇంక వెళ్తాను విజయా!" అన్నాను లేచి నుంచుని.

"సరే_" అంది విజయ నెమ్మదిగా.

"మరోసారి వస్తాను!" అని బయటకు నడిచాను. ఆ మర్నాడే మళ్ళీ వెళ్ళాను. ఇల్లు తాళం వేసిఉంది. మరోసారి వెళ్లేసరికి వాళ్ళు ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయినట్లు చెప్పారు.

ఆ తరువాత రెండు సంవత్సరాలవరకూ ఆమె జాడ కనిపించలేదు. ఈలోగా నా వివాహం అయిపోయింది.

ఓ రోజు విద్యానగర్ లో స్నేహితుడింటికి వెళ్ళి వస్తూండగా లోకల్ ట్రైన్ ప్లాట్ ఫారం మీద కనిపించింది.

## పిలుపు



నేను కంపెనీకి వెళ్లే తొందరలో ఉండటంచేత హడావిడిగా మాట్లాడాల్సి వచ్చింది.

"నేను మలక్ పేటలో ఉంటున్నాను! సాయంత్రం అయిదు దాటాక ఫోన్ చేసి నన్ను పిలవమంటే పిలుస్తారు ఇంటిగల వాళ్ళు!" అంటూ ఫోన్ నంబరిచ్చింది.

మర్నాడు ఆమెకోసం ఫోన్ చేశాను.

## శుచి - శుభ్రత

శుచి, శుభ్రత అనేవి స్నానంచేస్తేనే వస్తాయా? మనం రోజూ స్నానం చేస్తాం. రోజుకు రెండు మూడు సార్లు చేసే వారు కూడా ఉన్నారు. టిబెట్ లో జీవితంలో మూడుసార్లు స్నానం చేస్తారట. ఒకటి పుట్టినప్పుడు, రెండు పెళ్ళప్పుడు, మూడవది చచ్చినప్పుడు. అవివాహితులైనవారికి, రెండే స్నానాలు. రష్యాలో హోటళ్ళలో స్నానాలగదులు ఉండవు. ఐరోపా దేశాల హోటళ్ళలోనూ అంతే! స్నానాల గదులు ఉండనే వుండవు. అయినా వారు ఫ్రెష్ గా వుంటారు. చలిదేశాలు కదా! చెమటపోస్తే కదా చిరాకుగా. జిడ్డుగా వుండడానికి. టవల్ తో తుడుచుకుంటే సరి!

# పిలుపు



"ఏమిటి విశేషాలు?" అడిగింది ఫోన్‌లో.

"ఓసారి కోటీకి రాకూడదూ!" అడిగాను.

"ఇవాళ కుదరదు! ఇంకా ఇంతవరకూ వంటే కాలేదు!" అంది.

"అయితే నీవు వుంటున్న ఇంటి ఎడ్రస్ చెప్పు. అక్కడికి నేనే వస్తాను."

ఆమె ఎడ్రస్ యిచ్చింది.

నేను ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను.

నాలుగయిదు ఇళ్ళున్నాయ్ ఒకటే కాంపౌండ్‌లో. అందులో ఒక ఇల్లు ఆమెది. ఒకే ఒక గది. మిగతా వాళ్ళందరూ నావంక అదోలా చూడసాగారు.

ఇంట్లో ఒక మంచం, ఒక టేబిలూ, కుర్చీ, కొన్ని వంట గిన్నెలూ- రెండు పెట్టెలూ వున్నాయ్.

'టీ' తయారుచేసి ఇచ్చింది విజయ.

కొద్దిసేపు అవీ ఇవీ మాట్లాడిన తరువాత ఆమెని అమాంతం నా వళ్ళోకి లాక్కొని పెదాలమీద ముద్దు పెట్టుకొన్నాను. చాలా ఈజీగా తీసుకొని నా వళ్ళోంచి లేచి నుంచుంది.

"ఓ పక్కన ముసలిదాన్నయి పోయాను! అయినా నా మీద కోరిక పోలేదా?" నవ్వుతూ అడిగింది.

"ఇంకా- నేను నీ అందాన్నే ప్రేమిస్తున్నానన్న భ్రమలో నే వున్నావా?" అడిగాను దెబ్బ తిన్నట్లు.

"మరి? నీక్కావలసిందేమిటి?"

"నీ సర్వస్వం నాదేనన్న అనుభూతి!"

బయటనుంచి ఎవరో పిలిచారు. వెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది. మళ్ళీ ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకున్నాను.

"తలుపులు తీసే వున్నాయన్న విషయం గుర్తుందా?" నవ్వుతూ అందామె.

"వేసేస్తాను..."

"ఇంకానయం! నిన్ను ఇంట్లో పెట్టుకొని తలుపులేసేస్తే చుట్టుప్రక్కలవాళ్ళందరూ లోపల ఏం జరుగుతుందోఅర్థం చేసుకోలేరా?"

ఆమెను వదిలేశాను. ఇంటికి వచ్చాక ఆ రాత్రి నిద్ర పోలేదు.

అలా చాలా రాత్రులు వరుసగా నిదరపట్టలేదు. విజయమీద గ్లామర్ కన్నా, ఆమె మీద కలుగుతున్న జాలి నన్ను తినివేయసాగింది. ఆమెను ఎక్కడికైనా తీసుకెళ్ళిపోయి, నా భార్యను చేసుకుని, నేనామెను సుఖపెడితే... యిదే యోచన!

ఆ మర్నాడు ఫోన్ చేసేసరికి ఆమె ఇల్లు ఖాళీ చేసిందని, ఎక్కడికెళ్ళిందో తెలియదనీ చెప్పారు.

చాలా రోజుల తరువాత ఆఫీస్‌కో ఉత్తరం వచ్చింది. కవరుచింపి చదివాను. విజయ రాసింది.

"నేనెక్కడున్నానో నీకు తెలీడం నాకిష్టం లేదు. నేనంటే నీలో ఎంత పవిత్ర ప్రేమ ఉందో నాకు తెలుసోయ్! ఆ ప్రేమను మలినపరచడం నా కిష్టం లేదు. ఓ విషయం నీ దగ్గర దాచాను. చెప్తే నువ్ అసహ్యించుకుంటావేమో ననుకున్నది నిజం! అలా నువ్వు నన్ను అసహ్యించుకోవడం మాత్రం నేను భరించలేను! నేను మన ఊరు వదిలిన తర్వాతే నా పతనం ప్రారంభమైంది. చివరకు కేవలం నా శరీరాన్ని అమ్ముకొని నన్నూ, నా పాపనీ పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాలన్నీ నీకెలా చెప్పేది?

# పిలుపు



చెప్పినప్పుడు నువ్వు నా వంక చూసే చూపు ఎలా భరించేది? ఈ ప్రపంచంలో నన్ను ఆరాధిస్తోంది, ప్రేమిస్తోందీ ఒకే ఒక్క వ్యక్తి! అది నువ్వు! ఈ నిజం చాలు! నేను సంతోషంగా కళ్ళుమూయడానికి. ఏ స్త్రీకుంటుందోయ్ అంత అదృష్టం! ఆ సమయంలో తప్పక నా పిలుపు నీ కందుతుంది! నీ చేతుల్లోనే ఆఖరి శ్వాస తీసుకుంటాను! నాకప్పుడప్పుడూ అనిపిస్తూంటుంది! నన్నింతగా కోరుతూన్న నీకు నేను ఏమి ఇవ్వగలిగానా అని! కనీసం_ఆ రోజు చీకటిలో మా ఇంటిలో నువ్ నన్ను కౌగిలించుకొన్నప్పుడు_నీవశమయినా బాగుండేది! బహుశా వచ్చేజన్మలో భగవంతుడు నాకా అదృష్టం కలిగిస్తాడు. నా ప్రార్థన అదే! వుండనా మరి.

నీ_కేవలం_నీ విజయ."

కన్నీళ్ళు తుడుచుకొన్నాను. ఇంక చేయగలిగింది ఆమె పిలుపు కోసం ఎదురుచూడడమే! *